క్లుప్తంగా

భావనారుషి కల్యాణోత్సవం



పెనుగొండలో భావనారుషి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: గ్రామంలోని లింగాల వీధిలో ఆదివారం శ్రీభద్రావతి భావనారుషి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం కనుల పండువగా నిర్వహించారు. శూలాల పొడుచుకొని మొక్కుబడి ఉన్న యువకులు గ్రామోత్సవంలో పాల్గొన్నారు. అలుగల ప్రదర్శన ఆకట్టుకొంది. కేరళ బుట్ట బొమ్మల విన్యాసాలు, తీన్‌మార్ వాయిద్యాలతో ఆదివారం రాత్రి వరకూ ఉత్సవం నిర్వహించారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



బండి ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో అమ్మవారి ఆలయం కిటకిటలాడింది. సంక్రాంతి పండుగ కావడంతో దూర ప్రాంతాల నుంచి భక్తులు రాకతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఈఓ డి.రామకృష్ణంరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



జిన్నూరులో క్షత్రియుల ఆత్మీయసమ్మేళనం

పోడూరు: అల్లూరి సీతారామరాజు క్షత్రియసేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం జిన్నూరులో సంక్రాంతి సంబరాలు, క్షత్రియ ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగాయి. ఐడియల్ ఆడిటోరియం ప్రాంగణంలో వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. భోగిమంటలు, గంగిరెద్దుల ఆటలు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ ఆటపాటలతో వేడుకలను ఘనంగా నిర్వహించారు. సొసైటీ చైర్మన్ డీటీడీసీ బాబు, క్షత్రియ సంఘం నాయకులు పి.విశ్వనాథరాజు, జవహర్‌లాల్, ఐవీ రామరాజు, భూపతిరాజు సూర్యరాజు, రమేష్‌రాజు, దండు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

భోగి వైభోగం

- గ్రామాల్లో భోగి సందడి
- కూడళ్లల్లో భోగి మంటలు వేసిన యువకులు

పెనుగొండ: భోగి మంటలతో చిన్నారులు ఆదివారం సందడి చేశారు. పెనుగొండ, ఆచంట మండలాల్లో తెల్లవారు జాము నుంచి ప్రధాన కూడళ్లలో భోగి మంటలు వేయడంతో చిన్నారులు భోగి దండలు వేసి ఉత్సాహంగా గడిపారు. ఉమ్మడి కుటుంబాలు, సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన బంధువులతో గ్రామాలు కళకళలాడాయి. చిన్నారులు గొబ్బెళ్లు పెట్టి సంక్రాంతి లక్ష్మీకి స్వాగతం పలికారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: భోగి పండుగను మండలంలో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆదివారం వేకువజామునుండే పలువురు యువకులు పెద్ద పెద్ద దుంగలు, చెట్ల కొమ్మలను భోగి మంటలకు సిద్ధం చేశారు. పలు గ్రామాల్లో చిన్నారులు బొమ్మలకొలువును ఏర్పాటు చేశారు. కొందరు గొబ్బెమ్మలు పెట్టడం, చిన్నారులకు బోగిపళ్లు పోసేవేడుకలను ఘనంగా నిర్వహించారు.

యలమంచిలిలో..

యలమంచిలి: భోగి పండుగను ఆదివారం ప్రజలంతా సంప్రదాయంగా జరుపుకున్నారు. ఉదయమే స్నానాలు చేసి భోగి మంటలు వేసి అందులో గోవు పిడకలను వేశారు. అనంతరం భోగి మంటకు నమస్కరించారు. భోగి పండుగ సందర్భంగా చిన్న పిల్లలకు దిష్టి తీయడానికి భోగి పళ్ల వేశారు. రేగి పళ్ల, పువ్వులు, చెరకు ముక్కలు, శనగలు, పసుపు అక్షింతలు పిల్లలకు దిష్టి తీసి వారి తలపై వేశారు. దిష్టి తీసిన అనంతరం చెట్ల మొదళ్లలో వాటిని వేశారు.

ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో

పాలకొల్లు సెంట్రల్: సంక్రాంతి పండుగ సందర్భంగా మొదటి రోజు భోగి పండుగను ప్రజలు సంస్కృతి సంప్రదాయాలతో అత్యంత ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఆదివారం పట్టణంలో ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీబొమ్మల సెంటర్ వద్ద భోగి మంటను వెలిగించారు. హరిదాసులతో కీర్తనలు పాడించారు. స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో సంక్రాంతి వేడుకలు చేశారు. వేడుకలు అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. అలాగే పట్టణ ముఖ్య కూడళ్లలో యువకులు గత రెండు రోజులుగా సేకరించిన కలపను తీసుకువచ్చి ఒకచోట గోపురంలా పేర్చి భోగి మంటలను వెలిగించారు. ధర్మ పరిరక్షణ పట్టణ అధ్యక్షుడు గాదె వెంకన్న, శీరం ఆనందకృష్ణ, కేవీ కృష్ణవర్మ, మేడికొండ శ్రీనివాసరావు, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, కొల్లి కొండ ప్రసాద్ పాల్గొన్నారు.



పాలకొల్లు సెంట్రల్: భోగి మంటలు వేస్తున్న ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు



యలమంచిలి: భోగిపళ్ల వేడుకల్లో చిన్నారులు



పెనుగొండ: వడలి వివేకానంద సర్కిల్‌లో భోగి సందడి

వడలిలో వాలీబాల్ పోటీలు



వడలి వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు ఇస్తున్న దృశ్యం

పెనుగొండ: వడలి ఎస్సీ కమ్యూనిటీ హాల వద్ద సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీల్లో విజేతలుగా పాలమూరు, వడలి లగాన్, దేవ జట్లు మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఆదివారం సాయంత్రం ఫ్రెండ్స్ వాలీబాల్ టోర్నమెంట్ సభ్యులు విజేతలకు బహుమతులు అందించారు. 15 జట్లు హోరాహోరీగా పోటీ పడగా మొదటి స్థానంలో నిలిచిన పాలమూరు జట్టుకు రూ.10 వేలు నగదు, ట్రోఫీ, ద్వితీయ స్థానంలో నిలిచిన వడలి లగాన్ జట్టుకు రూ.7.500 నగదు, ట్రోఫీని, తృతీయ స్థానంలో నిలిచిన దేవ జట్టుకు రూ.5వేలు నగదు, ట్రోఫీని అందించారు.

ఘనంగా ముసలమ్మ జాతర

పాలకొల్లు సెంట్రల్: స్థానిక రామగుండం పార్కు వద్ద కొలువై ఉన్న శ్రీ పుంతలో ముసలమ్మ జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి రోజు నుంచి ఉత్సవాలు ప్రారంభించి ఐదు రోజులుపాటు జాతర నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు పిన్ని ఉప్పరి తెలిపారు. మొదటి రోజు గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు.

కారులో నగదు బ్యాగ్ చోరీ

కాళ్ల: నరసాపురం ఎంపీ కనుమూరి రఘురామకృష్ణంరాజు ఇంటి వద్ద నిలిపి ఉన్న కారు అద్దాలు పగలగొట్టి నగదు అపహరణకు గుర్తైనట్లు వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు ఆదివారం తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో ఉన్న ఎంపీను కలిసేందుకు పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామానికి చెందిన ఇందుకూరి శ్రీనివాసరాజు ఆదివారం మధ్యాహ్నం వచ్చారు. ఎంపీ రఘురామకృష్ణంరాజును కలిసేందుకు ఇంటి ముందు కారు నిలిపి లోపలికి వెళ్లారు. తిరిగి మళ్లీ బయటికి రాగా తన కారు ఎడమవైపు ముందు భాగంలో అద్దాలు పగలగొట్టి కారులో ఉన్న బ్లూ కలర్ బ్యాగును అపహరించారన్నారు. ఈ బ్యాగులో సుమారు రూ.2 లక్షల నగదు ఉన్నట్లు తెలిపారు. శ్రీనివాసరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వీరభద్రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాండ్రంలో పట్టభద్రుల సమ్మేళనం

ఉండి: మండలంలోని వాండ్రం గ్రామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ప్రతి ఏటా నిర్వహించే పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం గ్రామ సర్పంచ్ దాసరి వెంకటకృష్ణ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పట్టభద్రులతో గ్రామాభివృద్ధి, విద్యాభివృద్ధిపై చర్చించారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త ద్వారంపూడి నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ రెడ్డిపల్లి సత్యనారాయణ, ఆర్‌అండ్‌బీ డీఈ వర్మ, కనకదుర్గారావు, కృష్ణంరాజు, మాజీ సర్పంచ్ యాడంగి సుజాత ఏసు, ఉప సర్పంచ్ స్వరూపాశ్యాం తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల జోరు



నరసాపురం: 25వ వార్డు వీవర్స్‌కాలనీలో కోడిపందేల కోసం ఏర్పాటు చేసిన భారీ టెంట్

నరసాపురం/మొగల్తూరు: నరసాపురంలో కోడిపందేలు, గుండాటలు జోరుగా సాగాయి. పోలీసుల హెచ్చరికలను భేఖాతరు చేస్తూ పట్టణంలో శివారు ప్రాంతాలతో పాటుగా నరసాపురం, మొగల్తూరు మండలాల్లోని పలు గ్రామాల్లో పెద్దపెద్ద బరులు కట్టి ఆటలు నిర్వహించారు. పట్టణంలోని వీవర్స్‌కాలనీ, పీచుపాలెం, లక్ష్మణేశ్వరం ప్రాంతాల్లో నిర్వహకులు పెద్దపెద్ద బరులు ఏర్పాటు చేశారు. కోడిపందేలు మాటున గుండాట, పేకాట వంటి జూదాలు కూడా సాగాయి. పండుగ తొలిరోజు భోగి ఆదివారం రావడంతో పెద్ద ఎత్తున పందేలు సాగాయి.

కోళ్ల పందేల సందడి

పెనుగొండ: పెనుగొండ, ఆచంట మండలాల్లో కోడి పందేలు జోరుగా సాగాయి. ఉదయం 12 గంటల వరకూ పోలీసుల పహారా అధికంగా ఉండడంతో జూదగాళ్లు నిరుత్సాహపడ్డారు. 12 గంటల అనంతరం బరులు సిద్ధం కావడంతో ఒకరికి ఒకరు పోటీ పడ్డారు. పెనుగొండ, వడలి, దొంగరావిపాలెం, ములపర్రు, ఆచంట, వల్లూరు, శేషమ్మ చెరువుల్లో కోడిపందేల జోరు కనిపించింది.

పోడూరులో...

పోడూరు: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం కోడిపందేలు జోరుగా జరిగాయి. పోడూరు, కవిటం, పెనుమదం, గుమ్మలూరు, జిన్నూరు, పండితవిల్లూరు, జగన్నాథపురం, వద్దిపర్రు గ్రామాల్లో కోడిపందేలు వేశారు. కోడిపందేలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో జనం బరుల వద్దకు తరలివచ్చారు.

జోరుగా కోడి పందేలు

యలమంచిలి: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం కోడి పందేలు జోరుగా సాగాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి బరులు సిద్ధం చేసి పందేలు నిర్వహించారు. కలగంపూడి, గుంపర్రు, మట్లపాలెం, యలమంచిలి, కాజ, వడ్డిలంక, కొంతేరు, మేడపాడు, కనకాయలంక, బూరుగుపల్లి తదితర గ్రామాల్లో కోడి పందాలు, గుండాట జరిగాయి. కలగంపూడి, గుంపర్రు గ్రామాలలో రూ.లక్షల్లో పందేలు జరిగాయి. కొన్నిచోట్ల మహిళలే స్వయంగా గుండాట పోటీలు నిర్వహించారు.



పెనుగొండ: దొంగరావిపాలెంలో కోడి పందేలు



మొగల్తూరు: ముత్యాలపల్లిలో బరిలో తలపడుతున్న కోళ్లు



యలమంచిలి: కలగంపూడిలో కోడి పందేలు నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవాలు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి కాపులకొడపలో వేంకటేశ్వర స్వామి, పసలదీవి కోదండ రామాలయాల్లో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం గోదాదేవి కల్యాణం ఘనంగా నిర్వహించారు. పసలదీవి గ్రామంలో నెల రోజుల నుంచి తిరుప్పావై ప్రవచనాలను ముదుంబై వెంకటాచార్యులు చెబుతున్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన విధంగా మార్గశిర మాసంలో చేసే వ్రతం సత్ఫలితాలను ఇస్తుందని ఆయన చెప్పారు. గోదాదేవికి ఊంజల్ సేవను నిర్వహించి కల్యాణ ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. పూర్వం నుంచి పసలదీవి ప్రాంతంలో చక్రాంతకాలు ధరింపజేసిన భక్తులు దీక్షతో ధనుర్మాస వ్రతాన్ని ఆచరిస్తున్నారు. ఉదయం తీర్థగోష్టికి, సాయంత్రం ప్రవచన గోష్టికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భోగి పండుగ రోజైన ఆదివారం వేములదీవి వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో పెద్దింటి అరుణ్‌కుమారాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కల్యాణ వేడుకలో అలాగే సంక్రాంతి పండుగ రోజు రాత్రి కూడా విశేష పూజలు జరగనున్నాయని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెన్నాప్రగడ చక్రధరరావు మాస్టారు, ఉంగరాల శ్రీను, ఏడుకొండలు, ఉంగరాల నాగరాజు పాల్గొన్నారు.

మొగల్తూరులో...

మొగల్తూరు: భోగి పండుగను పురస్కరించుకుని మొగల్తూరులోని రుక్మిణీ సత్య భామా సమేత రాజగోపాలస్వామి ఆలయంలో గోదా సహిత రంగనాయక స్వామి శాంతి కల్యాణాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సుదర్శనం లక్ష్మీ నర్సింహచార్యులు, రామశేషాచార్యులు, రామకుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణానికి గ్రామంలోని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కల్యాణం అనంతరం స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు.

పెనుగొండలో..

పెనుగొండ: ధనుర్మాసం సందర్భంగా సిద్ధాంతంలోని విజయగోపాల స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఆదివారం అర్చకులు ఖండవిల్లి సీతారామాచార్యులు అర్చకత్వంలో ఖండవిల్లి శోభనాద్రాచార్యులు, రవి భాస్కరాచార్యుల పర్యవేక్షణలో కలగ సూర్యనారాయణ మూర్తి, తూములూరి కృష్ణప్రసాదు దంపతులు గోదా రంగనాథస్వామి వార్ల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ఈఓ డి.పుష్పభాను భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు.

పాలకొల్లులో...

పాలకొల్లు సెంట్రల్: స్థానిక బుధవారపు వీధి రామాలయంలో గోదాదేవి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధనుర్మాసం నెల రోజులు పూర్తయిన తరువాత భోగి పండుగ రోజున గోదాదేవికి శాంతి కల్యాణం నిర్వహిస్తారు. దానిలో భాగంగా ఆదివారం ఆలయంలో కృష్ణమాచార్యులు, వాసుదేవాచార్యుల బ్రహ్మత్వంలో గోదాదేవి కల్యాణం కన్నుల పండువగా జరిపించారు. ఈ కల్యాణంలో సుమారు పది మంది దంపతులు పాల్గొన్నారు. కళ్యాణం అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు శ్రీఘాకోళ్లపు వెంకన్న, విన్నకోట శ్రీరంగనాయకులు, నాళం ఉప్పరి, బదరి, సలాది నాని, రేపాక వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.



నరసాపురం రూరల్: వేములదీవిలో గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం



మొగల్తూరు: రాజగోపాలస్వామి ఆలయంలో గోదా దేవి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

అపూర్వ కలయిక

పెనుగొండ: సంక్రాంతి సందర్భంగా సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1997–98 పదవ తరగతి విద్యార్థులు ఆదివారం కలిశారు. 26 సంవత్సరాల అనంతరం పాఠశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించి చదువులు నేర్పిన గురువులను సత్కరించి, వారి వారి కుటుంబ సభ్యులను స్నేహితులకు పరిచయం చేసి గత స్మృతులను జ్ఞప్తి కి తెచ్చుకొన్నారు. హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్నం వంటి నగరాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి పూర్వ విద్యార్థులు తరలి రావడంతో పాఠశాలలో పండుగ వాతావరణ నెలకొంది. వీరిలో పూర్వ విద్యార్థులైన కాకినాడ సీఐ కొత్తూరు కిషోర్, రంపచోడవరం సీఐ వాసా వెంకటేశ్వరరావు, మచిలీపట్నం సీఐ వాసా పెద్దిరాజులతో పాటు, ముద్రగడ నాగేశ్వరరావు, బొక్కా మార్కండేయులు, కంచర్ల గుప్తా, సానబోయిన అనిల్, సయ్యపరెడ్డి గణపతి, మాదవి, వాసవీలతో పాటు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.



సిద్ధాంతం జిల్లా పరిషత్ పాఠశాల 997-98 బ్యాచ్ విద్యార్థులు